
క్లుప్తంగా

వైభవంగా చండీహోమం



ప్రత్యేక అలంకరణలో అంకాలమ్మ

కలసపాడు : మండల కేంద్రమైన కలసపాడులోని మహా అంకాలమ్మ ఆలయంలో శనివారం వైభవంగా చండీహోమం నిర్వహించారు. ఉదయం 8 గంటలకు కలశస్థాపన, గణపతిపూజ, రుత్వీకరణం, రుద్రాభిషేకం, చండీపారాయణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించనున్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దారు ఉమారాణిని సన్మానిస్తున్న అధికారులు

దువ్వూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం బదిలీ అయిన తహసీల్దార్ ఉమారాణికి రెవెన్యూ సిబ్బంది వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నంద్యాల జిల్లా ఆత్మకూరు తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఉమారాణిని దువ్వూరు మండల తహసీల్దార్‌గా బదిలీ చేశారు. తిరిగి నంద్యాల జిల్లాకు బదిలీపై వెళుతున్న సందర్భంగా ఉమారాణికి శాలువా కప్పి, పూలమాలతో రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉమారాణి మాట్లాడుతూ తన విధులకు సహకరించిన అధికారులు, సిబ్బందికి, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. బి.మఠం తహసీల్దార్ శ్రీనివాసులు, తిరుపతి జిల్లా సత్యవేడు తహసీల్దార్ రామాంజనేయులు, దువ్వూరు మండల రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల రాజీనామా

కాశినాయన : టీడీపీ నాయకుల ఒత్తిడికి రెవెన్యూ అధికారులు తలొగ్గి ఐదుగురు రేషన్ షాపు డీలర్లతో రాజీనామా చేయించారనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. మండలంలోని బాలాయపల్లె, గొంటువారిపల్లె, గంగనపల్లె, ఓబుళాపురం, ఉప్పలూరు గ్రామాల్లోని రేషన్‌షాపులు డ్వాక్రా మహిళా సంఘాలు ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్నారు. అయితే ఎలాంటి ఫిర్యాదులు లేకపోయినా రెవెన్యూ అధికారులు వారిచేత రాజీనామాలు చేయించారనే ప్రచారం జరుగుతోంది.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆషాఢమాసం నాల్గవ శనివారం సందర్భంగా స్వామి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామివారిని ప్రత్యేక అలంకరించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారికి కాయకర్పూరం సమర్పించారు.

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ

ప్రొద్దుటూరు : స్థానిక వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల గ్రంథాలయానికి రూ.10వేలు విలువ గల పుస్తకాలను శనివారం వితరణ చేశారు. గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీనివాసపురం వీధికి చెందిన బొల్లవరం వెంకటేశ్వరరెడ్డి గేట్ పరీక్షల పుస్తకాలను కళాశాల ప్రిన్సిపాల్ సి.నాగరాజుకు అందజేశారు. గ్రంథాలయాధికారి ఎం.శివారెడ్డి పాల్గొన్నారు.

ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని కోరుతూ తహసీల్దార్ విద్యాసాగర్‌కు శనివారం పీఆర్‌ఎస్‌వైఎఫ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ శంకర్ మాట్లాడుతూ జిల్లాలో ఉక్కుఫ్యాక్టరీ నిర్మిస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా 35 వేల మంది కిపైగా నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించి జిల్లా ప్రజల, నిరుద్యోగుల ఆకాంక్షను నెరవేర్చాలని కోరారు. జిల్లా కన్వీనర్ నాగేంద్రబాబు, నాయకులు బాషా, నరేంద్ర, తారక్, అబ్దుల్లా పాల్గొన్నారు.

నూతన కమిటీ నియామకం

ప్రొద్దుటూరు : స్థానిక హ్యూమన్ రైట్స్ మిషన్ కార్యాలయంలో శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ మిషన్ చైర్మన్ డాక్టర్ మహేంద్ర శర్మ ఆదేశాల మేరకు ఏపీ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బెల్లం ప్రభాకర్ నూతన కమిటీని నియమించారు. జిల్లా ప్రెసిడెంట్‌గా పాణ్యం అహమ్మద్ హుస్సేన్, వైస్‌ప్రెసిడెంట్‌గా ఎస్.సుబ్బరాయుడు, జనరల్ సెక్రటరీగా బాలు యాదవ్, వెల్ఫేర్ సెక్రటరీలుగా బాలాజీ, ఖలీల్ బాషా, లీగల్ సెక్రటరీగా పురుషోత్తం, మీడియా సెక్రటరీగా చిన్ని కృష్ణను నియమించారు.

వరుస చోరీలు.. జనం బెంబేలు

- కేసు నమోదు చేయని రక్షకభటులు
- పోలీసులకు సవాల్ విసురుతున్న దొంగలు
- ఫిర్యాదు చేసేందుకు బాధితుల అవస్థలు
- గస్తీ పెంచాలని స్థానికుల వేడుకోలు



ఖాజీపేట : 'సాధారణంగా మనకు అన్యాయం జరిగితే పోలీసుల దగ్గరకు వెళ్తాం.. కానీ వారు పట్టించుకోకపోతే ఎవరి దగ్గరికి వెళ్లాలి' అన్నది ఖాజీపేట వాసులకు ప్రశ్నగా మారింది. చోరీలు జరిగినా కేసులు నమోదు చేయరు.. ట్రాన్స్‌ఫార్మర్ పోయినా పట్టించుకోరు.. బైక్ చోరీ జరిగినా స్పందించరు.. ఇదేమి చోద్యం అని స్థానికులు వాపోతున్నారు. వివరాల్లోకి వెళితే.. ఖాజీపేటలోని అగ్రహారంలో శుక్రవారం రెండు చోరీలు జరిగాయి. గుండ్లకంట జయరాము అనే వ్యక్తి ఇంటిలో చోరీ జరిగింది. ఇంటి వద్ద పంచలో నిద్రపోతుండగా దొంగలు ఇంటి వెనుక ఉన్న తలుపు పగులగొట్టి లోపలికి వెళ్లి రూ.28,200 నగదు, రెండు బంగారు చైన్లు, 2 జతల కమ్మలు, మాటీలు చోరీ చేశారు. కొత్త బట్టలు 10 జతలు ఎత్తుకు పోయారు. పక్కనే ఉన్న గుండ్లకంట చిన్నక్క ఇంట్లో దొంగలు పడ్డారు. ఇంట్లో ఉన్న 10 జతల చీరలు, 10 వేల పింఛన్ డబ్బులు ఎత్తుకు పోయారు. చిన్నక్క తన కూతురు ఊరికి పోవడంతో మనవరాళ్లు ఒంటరిగా ఉంటారని తాళం వేసి గురువారం రాత్రి కూతురు ఇంటికి వెళ్లింది. ఇంటి వెనుక భాగం నుంచి వచ్చి చోరీ చేశారు. వరుస చోరీలకు పాల్పడుతూ పోలీసులకు దొంగలు సవాల్ విసురుతున్నారు.

ఫిర్యాదు చేసినా..

ఈ నెల 9న ఖాజీపేటలో 6 చోట్ల చోరీలు జరిగాయి. అది మరువక ముందే శుక్రవారం తెల్లవారుజామున మరో రెండు ఇళ్లలో చోరీ జరిగింది. 6 చోట్ల చోరీ జరిగినా ఇంత వరకూ కేసు నమోదు చేయలేదు. ఎందుకంటే పెద్దగా ఆస్తి నష్టం జరగలేదని.. బాధితులు రాలేదన్న సాకు చూపి కేసు నమోదు చేయడం లేదని అంటున్నారు. తాజాగా అగ్రహారంలో చోరీ జరిగిన ఇంటికి పోలీసులు వెళ్లి పరిశీలించారు. ఇదే విషయంపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అగ్రహారం గ్రామంలోని మామిళ్ల రాఘవేంద్రకుమార్ అనే రైతు పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి, కోర్‌తో పాటు ఆయిల్‌ను 11వ తేదీ చోరీ చేశారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ ఫిర్యాదు తీసుకోలేదు. విద్యుత్ అధికారులకు సిఫార్సు చేశారు. విద్యుత్ అధికారుల వద్దకు వెళ్తే.. కేసు నమోదు చేయకపోతే నేను నీకు న్యాయం చేయలేనని బాధితులకు తెలిపారు. దీంతో పలుమార్లు పోలీసుల వద్దకు వచ్చినా వారి నుంచి సరైన స్పందన లేకపోవడంతో రైతు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. అయ్యప్ప స్వామి గుడిలో పని చేసే వాచ్‌మెన్ గంగిరెడ్డి ద్విచక్ర వాహనం రెండు వారాల క్రితం పోయింది. ఫిర్యాదు చేసేందుకు పోలీసుల వద్దకు వెళితే పరిశీలించి న్యాయం చేస్తాం అని సర్ది చెప్పి పంపించారని బాధితుడు వాపోయారు.

గస్తీ పెంచుతున్నాం



చోరీలు జరుగుతున్న విషయం నా దృష్టికి వచ్చింది. గస్తీలను పెంచుతున్నాం. ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసి చోరీలకు పాల్పడుతున్న వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటాం. పోలీసులు కేసు నమోదు చేయకపోతే నేరుగా నాకు ఫిర్యాదు చేయవచ్చు. శాంతి భద్రతలను కాపాడుతాం

– టి.వెంకటేశులు, డీఎస్పీ, మైదుకూరు

పోరాటంతోనే సాగునీటి ప్రాజెక్టులు పూర్తి

చాపాడు: రాజకీయాలకతీతంగా రైతులందరూ పోరాడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, నూతన ప్రాజెక్టులను సాధించుకోగలమని ఏపీ రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఏవీ రమణ అన్నారు. మండలంలోని అన్నవరం గ్రామంలో శనివారం రైతులతో కలసి ఏవీ రమణ విలేకరులతో మాట్లాడుతూ పెరిగిన పెట్టుబడి వ్యయం, గిట్టుబాటుకాని ధరలు, అనుకూలించని వాతావరణంతో అన్నదాత నలిగిపోతున్నాడని తెలిపారు. వరుస విపత్తులు రైతు కంటికి కునుకు లేకుండా చేస్తున్నాయని, అవసరం లేని సమయంలో అకాల వర్షాలు, సీజన్‌లో వర్షాభావం రైతాంగాన్ని వెక్కిరిస్తోందని పేర్కొన్నారు. కడప జిల్లా రైతు సేవా సమితిని బలోపేతం చేయాలని కోరారు.

చెన్నకేశవ స్వామి ఆలయ చైర్మన్ రాజీనామా

చాపాడు: మండల పరిధిలోని చియ్యపాడు గ్రామంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ చైర్మన్ ఎం.నిరంజన్‌రెడ్డి తన పదవికి శనివారం రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని ఈఓకు అందజేశారు. వ్యక్తిగత కారణాలతో తన పదవికి రాజీనామా చేస్తున్నానని తన హయాంలో ఆలయ అభివృద్ధి కోసం కృషి చేశానన్నారు. ఆలయ పునరుద్ధరణకు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, దాతల సహకారంలో ఆలయ పునఃనిర్మాణానికి కృషి చేశామని గుర్తుచేశారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షల వెల్లువ



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బద్వేలు అర్బన్ : శాసనసభ ప్యానల్ స్పీకర్‌గా నియమితులైన బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధను శనివారం ఎన్‌జీఓ కాలనీలోని ఆమె కార్యాలయంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో కష్టపడి పనిచేసి తనను గెలిపించారని, ఆ క్రమంలోనే తనకు ఈ గౌరవం దక్కిందని అన్నారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

ఎమ్మెల్యే పరామర్శ

అనారోగ్యానికి గురై కోలుకుంటున్న పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులను శనివారం ఎమ్మెల్యే డాక్టర్ సుధ పరామర్శించారు. స్థానిక భావనారాయణనగర్‌లో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తాశ్రీరాములును పరామర్శించి ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే 16వ ఇన్‌చార్జి నిమ్మకాయల గురివిరెడ్డి, మాజీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ముడమాల బాలమునిరెడ్డిని పరామర్శించారు. మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, వైస్‌చైర్మన్ సాయికృష్ణ, బద్వేలు, పోరుమామిళ్ల జెడ్పీటీసీలు చిన్నపోలిరెడ్డి, ముత్యాలప్రసాద్, బి.కోడూరు మండల ఉపాధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీఐఐసీ మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, గోపవరం మండల జేసీఎస్ కన్వీనర్ పుల్లయ్య, వార్డు ఇన్‌చార్జిలు బిజ్జంరమణ, ఆవులశ్రీను, కుప్పాలశ్రీరాములు పాల్గొన్నారు.

జీఓ 117ను రద్దు చేయాలి

కలసపాడు : ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు గుదిబండగా మారిన జీఓ 117ను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇ.బాలకోజి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ (257) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖామంత్రి లోకేష్ పాదయాత్రలో జీఓ 117ను రద్దు చేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలకే వర్తింపజేయాలని, ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని, పాఠశాలల కరెంటు బిల్లులను ప్రభుత్వం చెల్లించాలని కోరారు. ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.బాలసుబ్బయ్య, ఏపీటీఎఫ్ నాయకులు జి.ప్రభాకర్, ఎం.ప్రభాకర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, వెంకటసుబ్బయ్య, గురయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

పోరుమామిళ్ల: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, పర్యావరణాన్ని కాపాడేందుకు మొక్కలు పెంచాలని టేకూరుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ పిలుపునిచ్చారు. జాతీయ విద్యావిధానం 4వ వార్షికోత్సవం సందర్భంగా హెడ్మాస్టర్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో శనివారం విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు పెంచడాన్ని అందరూ ఓ ఉద్యమంలా చేపట్టాలన్నారు. అప్పుడే అందరికీ స్వచ్ఛమైన ఆక్సిజన్ అందుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హత్యలు, అత్యాచారాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల: కూటమి ప్రభుత్వం హత్యలు, అత్యాచారాలు, దాడులపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం రాత్రి ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విడుదల చేస్తున్న శ్వేతపత్రాల్లో విషయమేమీ ఉండడం లేదని ఎద్దేవా చేశారు. టీడీపీ ప్రభుత్వం పెడుతున్న శ్వేతపత్రాలతో.. తమ హయాంలో ఇచ్చిన హామీలను నెరవేర్చబోమని చేయబోమని చెప్పినట్లు అనిపిస్తోందని విమర్శించారు. సవాళ్లకు భయపడే.. మిత్రపక్షాల కోసమే చంద్రబాబు పరుగులు తీస్తుంటారని ఎద్దేవా చేశారు. రాష్ట్రం నెలరోజుల్లోనే రావణకాష్టంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి నాయకులు ఎన్నికల హామీలను తప్పకుండా అమలు చేయాలని లేకుంటే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

సుదర్శనక్రియతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు

కలసపాడు : సుదర్శనక్రియతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగా టీచర్ బి.ఎస్.నారాయణరెడ్డి అన్నారు. శనివారం పెండ్లిమర్రి వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ పాఠశాల, కలసపాడు బాలికల ఉన్నత పాఠశాల, ఎగువ రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో విద్యార్థులకు సెమినార్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్వాసప్రక్రియలు, సుదర్శన క్రియ, భస్త్రిక ప్రాణాయామము, సూక్ష్మప్రాణాయామాలతో విద్యార్థినులు వ్యక్తిగత సమస్యల నుంచి ఒత్తిడిని అధిగమించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కమాల్, రెడ్డిజ్యోతి, కవిత, పురుషోత్తంరెడ్డి, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దోమకాటు ఆరోగ్యానికి చేటు



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి

ప్రొద్దుటూరు : దోమకాటు ఆరోగ్యానికి చేటు అని, దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక రమణ మహర్షి హైస్కూల్, 2వ వార్డు మున్సిపల్ హైస్కూల్‌లో సీజనల్ వ్యాధులు, స్టాప్ డయేరియా, కుష్ఠు వ్యాధి నిర్మూలన గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలంలో ఇంటి పరిసరాల్లో నీరు నిలబడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డే గా పాటించాలన్నారు. డాక్టర్లు శివప్రసాద్‌రెడ్డి, దినేష్, మౌనిక మాట్లాడుతూ మలేరియా, డెంగీ, టైఫాయిడ్, డయేరియా, కుష్ఠు వ్యాధుల లక్షణాలు, చికిత్స, నివారణ చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డీపీఎంఓ శివశంకరయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, శోభారాణి, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్స్ నూర్ బాషా, సుబ్బరాయుడు, పీడీలు శామ్యూల్, ప్రశాంత్, సీఓలు సుబ్బారెడ్డి, నాగజ్యోతి, హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సచివాలయ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పోష్ చట్టంతో మహిళలకు రక్షణ



పోష్ చట్టంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీఓ లక్ష్మీదేవి

కలసపాడు : పోష్ చట్టంతో మహిళలకు రక్షణ లభిస్తుందని ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీఓ లక్ష్మీదేవి తెలిపారు. స్థానిక మండల పరిషత్ సభా భవనంలో శనివారం మహిళా ఉద్యోగులకు పోష్ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సురక్షిత వాతావరణంలో పనిచేయడం ప్రతి మహిళ చట్టబద్ధ హక్కు అని పేర్కొన్నారు. పది మంది కంటే ఎక్కువ ఉద్యోగులు పని చేసే ప్రతి కార్యాలయంలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఉంటుందన్నారు. బాధిత ఉద్యోగులు ఈ కమిటీ ద్వారా రక్షణ పొందవచ్చని చెప్పారు. అసంఘటిత రంగాల్లో పనిచేసే మహిళలు లైంగిక వేధింపులకు గురైన సందర్భంలో మండల రెవెన్యూ అధికారికి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఉమెన్ హెల్ప్‌లైన్ నెంబర్ 181 గురించి గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని మహిళా సంరక్షణ కార్యదర్శులకు సూచించారు. తహసీల్దారు కృష్ణకుమార్, ఈఓపీఆర్డీ మురారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హరిప్రియ, ఏఎస్ఐ నాగేంద్ర, పంచాయతీ సెక్రటరీలు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేటలోని శ్రీ చౌడేశ్వరి తొగటవీరక్షత్రియ కల్యాణమండపంలో కల్యాణమండపం, వరల్డ్‌హెల్త్ డెవలప్‌మెంట్ అండ్ హ్యూమన్ రైట్స్‌ఫోరం కర్నాటక ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ సాధిక్‌బాష మాట్లాడుతూ ప్రాచీనమైన వర్మ కళాచికిత్స, టిబెటియన్ బిందు చికిత్స, ఆక్యుప్రెషర్, ఆక్యుపంక్చర్, వంటి 21 చికిత్సా పద్ధతులతో 300పైగా రోగులకు వైద్యసేవలు అందించామని తెలిపారు. బెంగుళూరు, హైదరాబాదుకు చెందిన డాక్టర్లు నసీరుద్దీన్, అష్మ, ముసద్దిక్‌పాషా, సుబ్రహ్మణ్యం ఆచారి, సుభాన్, కరీముస్ తదితరులు వైద్యసేవలు అందించారు. మోకాళ్లనొప్పి, నడుంనొప్పి, పక్షవాతం, సయాటిక, సైనసైటిస్, సర్వైకల్ స్పాండిలోసిస్ తదితర వాటికి ఈ వైద్య శిబిరంలో వైద్య సేవలు చేశారు. ఆదివారం కూడా ఈ ఉచిత వైద్య శిబిరం ఉంటుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ కల్యాణ మండప అధ్యక్షుడు బండారు రఘురామయ్య, మనప్రజా సేవాసమితి అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, బైసాని సత్యనారాయణపాల్గొన్నారు.

అబ్దుల్ కలాం జీవితం ఆదర్శనీయం

ఖాజీపేట : భారతరత్న, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి అన్నారు. శనివారం అబ్దుల్ కలాం వర్ధంతిని బీరం శ్రీధర్ రెడ్డి స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన గొప్ప మహనీయుడు అబ్దుల్ కలాం అని కొనియాడారు. అణుశాస్త్ర పితామహుడిగా దేశానికి ఎనలేని సేవ చేశారని ప్రశంసించారు. బీరం శ్రీధర్‌రెడ్డి పాఠశాల కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి, స్టేట్ కల్చరల్ కన్వీనర్ భాను ప్రకాష్, కేంద్ర పథకాల చైర్మన్ సింగారెడ్డి రామచంద్రారెడ్డి, రోశన్న పాల్గొన్నారు.

కేసీ నీటి విడుదలకు చర్యలు తీసుకోండి



కేసీ కాలువ అధికారికి వినతి పత్రాన్ని అందజేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

మైదుకూరు : కేసీ కాలువకు నీటిని విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఐ అనుబంధ ఏపీ రైతు సంఘం నాయకులు శనివారం అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు వారు మైదుకూరు కేసీ కాలువ సబ్ డివిజనల్ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్ మాట్లాడుతూ ఎగువ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలకు శ్రీశైలం ప్రాజెక్టుకు భారీ స్థాయిలో వరద జలాలు వస్తున్నాయన్నారు. ఇప్పటికే నీటి మట్టం 865 అడుగులు పైబడి రావడం జరిగిందని అధికారులు నీరు విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు. గత సంవత్సరం మైదుకూరు డివిజన్‌లోని కేసీ కెనాల్ బెల్టుకు మాత్రమే నీళ్ల రాకపోవడ వలన పంటలు లేక రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఈ సంవత్సరమైనా సకాలంలో నీళ్ల వదిలి రైతులు వరి పంట పండించుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. నీటి విడుదల విషయంలో స్పష్టమైన ప్రకటన చేసి రైతులు నారుమళ్లు పోసుకునే విధంగా అధికారులు స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సమితి సభ్యులు పెద్ద పుల్లయ్య, గోశెట్టి రామ్మూర్తి, రైతు సంఘం నాయకులు కొమ్మినేని చెన్నయ్య, చంద్ర ఓబుళరెడ్డి, కొమ్మినేని లక్ష్మయ్య, కంచం నారాయణ, బురుగోళ్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాజయోగ సాధన దివ్య ఔషధం

ప్రొద్దుటూరు కల్చరల్ : రాజయోగసాధన శారీరక, మానసిక రుగ్మతలకు దివ్యఔషధమని హుబ్లీకి చెందిన రాజయోగ ట్రైనర్ విజయ్ పేర్కొన్నారు. స్థానిక విజయనగరం వీధిలోని ఓం శాంతి భవన్‌లో శనివారం రాజయోగ సాధనతో సంతోషమయ జీవన విధానం అనే అంశంపై సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ నిత్యజీవితంలో భౌతిక సాధనాలకే పరిమితమైన మానవుడు సంతోషాన్ని కోల్పోతున్నాడని తెలిపారు. శారీరక, మానసిక రుగ్మతలకులోనై ప్రశాంతతకు దూరం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మానవ హితానికి, మనో వికాసానికి రాజయోగ సాధన దివ్య ఔషధమని పేర్కొన్నారు.

శానిటరీ మేస్త్రీ మృతి



చిన్న నరసింహులు మృతదేహానికి నివాళి అర్పిస్తున్న యూనియన్ నాయకులు

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న రెండో డివిజన్ శానిటరీ మేస్త్రీ కాకి చిన్న నరసింహులు (చంద్ర) శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. గుండెపోటు రావడంతో వెంటనే ఆయనను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈయన భార్య కాకి తిరుపతమ్మ గతంలో టీడీపీ కౌన్సిలర్‌గా పనిచేశారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డితో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) పట్టణ గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సాల్మన్, అధ్యక్షుడు చంటి, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుబ్బరాయుడు, రామయ్య, యూనియన్ నాయకులు చిన్న నరసింహులు మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

పోరాటాలకు సిద్ధం కండి



ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

బద్వేలు అర్బన్ : పేదల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు అవలంబిస్తున్న నిర్లక్ష్యంపై ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సీపీఎం రూరల్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద నిర్వహించిన మహాధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రశ్నించకపోతే ప్రభుత్వాలు పేదల కోసం పనిచేయవని, గడిచిన 70 సంవత్సరాలుగా ప్రభుత్వాలు మారుతున్నా పేదల జీవితాల్లో మార్పు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే నియోజకవర్గంలో జరిగిన భూకబ్జాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. బద్వేలు మండలం సి.కొత్తపల్లె రెవెన్యూ పొలం, అట్లూరు మండలం నల్లాయపల్లె గ్రామపొలంలలో జరిగిన ప్రభుత్వ భూముల కబ్జాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. అలాగే సి.కొత్తపల్లె పొలంలోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలకు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. తెలుగుదేశం ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని ప్రతి నియోజకవర్గంలో నిర్వహించాలని కోరారు. అనంతరం ఆర్డీఓ చంద్రమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రామ్మోహన్, రూరల్ కమిటీ కార్యదర్శి వెంకటేష్, నాయకులు వెంకటరమణ, దాండ్‌బాషా, రామ్మోహన్ పాల్గొన్నారు.

కౌలు రైతులను గుర్తించాలి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి అమరనాథరెడ్డి

దువ్వూరు : మండలవ్యాప్తంగా కౌలు రైతులను గుర్తించి వారికి కౌలు కార్డులను మంజూరు చేయాలని మండల వ్యవసాయాధికారి అమరనాథరెడ్డి తెలిపారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు కార్డులు ఉన్న రైతులకు ప్రభుత్వం నుంచి రైతు భరోసా, పంట నష్టపరిహారం, వారు పండించిన పంటలకు ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. వ్యవసాయశాఖ, రెవెన్యూ శాఖ సిబ్బంది కౌలు రైతులకు కౌలు కార్డులు ఇచ్చేలా కృషి చేయాలన్నారు.

పంట కాలువ పూడ్చివేయడంతో సమస్య

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల చెరువు నుంచి రంగసముద్రం చెరువుకు పోతున్న పంటకాలువను పూడ్చి వేయడంతో నీరు నిలిచి సమస్యగా మారిందని సీపీఎం మండల కార్యదర్శి భైరవప్రసాద్, సీఐటీయూ మండల కన్వీనర్ కుప్పాల పుల్లయ్య ఆరోపించారు. శనివారం వారు మాట్లాడుతూ గతంలో పోరుమామిళ్ల చెరువు నుంచి రంగసముద్రం చెరువుకు పంటకాలువ ద్వారా నీరు వెళుతుండేదని పేర్కొన్నారు. అయితే రియల్ ఎస్టేట్ వ్యాపారులు పంటకాలువ కబ్జా చేసి పూడ్చి, ఇంటి స్థలాల కొరకు ప్లాట్లు వేశారని తెలిపారు. దీంతో చెరువు నుంచి వచ్చిన నీరు వెంకటేశ్వర ఉన్నత పాఠశాల సమీపంలో మురికి నీళ్ల కుంటగా మారిందని అన్నారు. మురుగునీటితో స్థానికులు అవస్థ పడుతున్నారని తెలిపారు.